# గురుకుల భవనానికి తాళం

**అధికారి హామీతో లాక్ తీసేసిన యజమాని**

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 15 : అద్దె చెల్లించడం లేదంటూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో ఉన్న మైనార్టీ గురుకుల బాలుర -2 విద్యాలయానికి మంగళవారం భవన యజమాని తాళం వేశారు. కొన్ని నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో విద్యుత్ బిల్లులు, పన్నులు, ఇతరత్రా నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని యజమాని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలలుగా అద్దె చెల్లింపులపై నిర్లక్ష్యం వహించడంతో గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యాజమాన్య సంఘం పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బయటే నిరీక్షించారు. యజమానితో ఉన్నతాధికారులు ఫోన్‌లో మాట్లాడి అద్దె త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో తాళం తొలగించాడు. ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు ఉండగా.. 400 మందికి పైగా విద్యాభ్యాసం చేస్తున్నారు.



పాఠశాల ఆవరణలో నిరీక్షిస్తున్న విద్యార్థులు

# రెండోరోజూ కొనసాగుతున్న రద్దీ

మహబూబ్‌నగర్ అర్బన్ అక్టోబర్ 15 జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రెండోరోజు మంగళవారం ప్రయాణికుల రద్దీ కొనసాగుతుంది.దసరా వేడుకలు,పాఠశాల సెలవులు,కళాశాలకు సెలవులు ముగియడంతో ప్రయాణికులు బస్సులకోసం గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. ముఖ్యంగా హైదరాబాద్‌కు బస్సులులేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి తిరుగు ప్రయాణమైన వారికి తిప్పలు తప్పలేదు. ఓవైపు వర్షం..మరోవైపు బస్సులు ఫుల్ అయి వస్తుండడంతో సీట్లకోసం పోటీ పడ్డారు. దసరా పండుగ కోసం మహబూబ్‌నగర్ రిజియన్ పరిధిలో హైదరాబాద్‌కు రోజువారితో పాటు ప్రత్యేకంగా 210 బస్సులు నడిపిస్తున్న ట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు.



హైదరాబాద్ బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

**ఘనంగా మహబూబ్‌సామి ఉర్సు**

మరికల్/ధన్వాడ, అక్టోబర్ 15 : గ్యార్వీనెలను పురస్కరించుకొని సోమవారం అర్ధరాత్రి మరికల్, ధన్వాడలో మహబూబ్‌సామి దర్గాల వద్ద ఉర్సు వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు గంధం ఎత్తుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

















